సాక్షి వికారాబాద్

గురువారం । 8 । జూన్ । 2023



పాత పంటలు ఏమాయె!

పాత పంటలు పరమౌషధాలు. సజ్జ, ఉలువ, జైదలు, సామలు, కొర్రలు వంటి పంటల సాగు ప్రస్తుతం కానరావడంలేదు. 8లో▸



మాదక ద్రవ్యాల నిర్మూలన

గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనకు సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 8లో▸



కూర'గాయాలు'

వేసవి ఎండలతో పాటు కూరగాయలు, మాంసం, నిత్యావసర సరుకుల ధరలు మండిపోతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

శిశు సంక్షేమ శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు మిషన్ వాత్సల్య (చైల్డ్ లైన్) లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాలు చేపడుతున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రాజెక్టు కో ఆర్డినేటర్-1, గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేట్ ఇన్ సోషల్ వర్క్, సోసియాలజీ, హ్యూమెన్ రైట్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సైకాలజీ వంటి వాటిలో పట్టా పొంది ఉండాలన్నారు. అదే విధంగా కౌన్సిలర్ -1 మహిళలు, శిశు అభివృద్ధి రంగాల్లోని ఎన్జీఓల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్ వైజర్ ఖాళీలు -03 ఉన్నాయి. బీఏ ఇన్ సోషల్ వర్క్, కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కమ్యూనిటీ సోసియాలజీ వంటి పట్టాలు పొంది ఉండాలన్నారు. కేస్ వర్క్ ఖాళీల సంఖ్య 3 ఉన్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతో పాటు చక్కని భావవ్యక్తీకరణ నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. ఈ ఉద్యోగాలకు వయోపరిమితి జులై 2023 నాటికి 21 నుంచి 35 ఏళ్ల లోపు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారాలను డౌన్లోడ్ చేసుకొని జూన్ 17 నాటికి కలెక్టరేట్‌లోని మహిళా శిశు సంక్షేమ శాఖలో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాల కోసం 98661 68298ను సంప్రదించాలని తెలిపారు.

కొవ్వొత్తుల ప్రదర్శన



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

అనంతగిరి: ఒడిశా రాష్ట్రం రైలు ప్రమాద మృతులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ మంగళవారం రాత్రి వికారాబాద్ పట్టణంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ప్రజా వాయిస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో ప్రతినిధులు అశోక్, యాదగిరి, వేణు మయూర్ ఆనంద్, శ్రవణ్, నర్సింహులు, రాజు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి



నాయకులు, అధికారులతో సమావేశమైన ఆర్డీఓ వేణుమాధవ్‌రావు

చేవెళ్ల: కొత్తగా ఓటు హక్కుకోసం పొందాలనుకునే అభ్యర్థులు ఫామ్ 6 ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ వేణుమాధవ్ రావు సూచించారు. బుధవారం తన కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. బూత్ లెవెల్ ఆఫీసలతో ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఓటరు లిస్టుపై సర్వే చేయిస్తున్నామని తెలిపారు. తొలగించిన ఓట్లపై మరోసారి విచారణ చేయించి, అర్హులైన వారిని జాబితాలో చేరుస్తామని స్పష్టంచేశారు. మండలాల వారీగా ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేస్తున్నామని, ఇందులో ఏవైనా పొరపాట్లు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో డీఏఓ మహ్మద్ తౌఫిక్, శంకర్‌పల్లి తహసీల్దార్ నయీమొద్దీన్, చేవెళ్ల నాయబ్ తహసీల్దార్ రాజశేఖర్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న సీఆర్డీ విజిలెన్స్ బృందం

యాచారం: గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర కార్యాలయం విజిలెన్స్ అధికారుల బృందం బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించింది. సీఆర్డీకి చెందిన ఉమారాణి, ఉష, నీరజ తదితరులు యాచారంలోని బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించారు. ఇక్కడ పెంచుతున్న మొక్కలను పరిశీలించి, వేసవి దృష్ట్యా వారానికి రెండు, మూడు సార్లు నీరు అందించాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. సాగర్‌రోడ్డు, చౌదర్‌పల్లి, గునుగల్, ఆగాపల్లి తదితర ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను పరిశీలించారు. అనంతరం ఈజీఎస్ కార్యాలయంలో రికార్డులు, కూలీల వేతనాలు చెల్లింపు తదితర వివరాలను సేకరించారు.

జోరుగా గాలివాన

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- కూలిన విద్యుత్ స్తంభాలు, చెట్లు



ధారూరు: కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులపై కప్పిన ప్లాస్టిక్ కవర్లు



పరిగి: వల్లభనగర్‌లో కూలిన విద్యుత్ స్తంభం

వికారాబాద్/ధారూరు/పరిగి: జిల్లాలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం రాశులు తడిసిముద్దయ్యాయి. ధారూరులో గంటపాటు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కురిసిన వానకు ప్రజలు భీతిల్లిపోయారు. వన నర్సరీలపై వేసిన షేడ్‌నెట్‌లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల ఇళ్లకు కనెక్షన్ ఇచ్చిన సర్వీస్ వైర్లు తెగిపడటంతో సరఫరా లేక చిమ్మచీకట్లో గడిపారు. పరిగి, ధారూరు, గట్టెపల్లి, నాగారం, నాగసమందర్ తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని కాపాడుకునేందుకుపడరాని పాట్లు పడ్డారు. ఈదురు గాలులకు ధాన్యంపై కప్పిన కవర్లు లేచిపోవడంతో తడిసిపోయాయి. పరిగి పట్టణంలోని వల్లభనగర్ కాలనీలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. షాద్‌నగర్ రోడ్డులో చెట్టు విరిగి రోడ్డుపై పడటంతో వాహన దారులు ఇబ్బందులకు గురయ్యారు. వికారాబాద్ పట్టణంలోనూ భారీ వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

అంగట్లో రేషన్ బియ్యం!

అక్రమ దందా హద్దులు దాటుతోంది.. పేదల బియ్యం పక్కదారి పడుతోంది. నెలకు వేల క్వింటాళ్ల బియ్యం నల్లబజారుకు తరలుతోంది. గుట్టుగా రైస్ మిల్లులకు తరలించి రీసైక్లింగ్ చేస్తున్నారు. సాధారణ బియ్యంలో కలిపి విక్రయిస్తున్నారు. అక్రమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అధికారుల కనుసన్నల్లోనే ఈ దందా కొనసాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా పరిగి, కొడంగల్, తాండూరు ప్రాంతాలలో తెల్లకార్డులపై వస్తున్న బియ్యంలో అధిక శాతం బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తుండటం గమనార్హం.



పరిగి ప్రాంతంలోని ఓ గోదాంలో పట్టుబడిన రేషన్ బియ్యం

యథేచ్ఛగా అక్రమ దందా

- గుట్టుగా రైస్ మిల్లులకు తరలించి రీసైక్లింగ్
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- నామమాత్రంగా పీడీయాక్టు ప్రచారం

వికారాబాద్: రేషన్ బియ్యంతో పాటు మధ్యాహ్న భోజనం, హాస్టళ్లు, తదితర సంస్థలకు వస్తున్న బియ్యం సైతం పక్కదారి పట్టిస్తున్నారు. పాఠశాలల బియ్యం, రేషన్ బియ్యం పట్టుబడటం సర్వసాధారణంగా మారింది. వరి పండించే మండలాలు, మున్సిపాలిటీలలో ఈ దందా ఎక్కువగా కనిపిస్తోంది. ఇందులో రేషన్ డీలర్లు మొలుకుని రైస్ మిల్లు యజమానులు, కొందరు వ్యాపారులు కుమ్మక్కై నిర్వహిస్తున్నారు. అక్రమ వ్యాపారులు ప్రత్యేకంగా గోదాములను ఏర్పాటు చేసుకుని దందాను కొనసాగిస్తుండటం గమనార్హం.

కానరాని పీడీ యాక్టు అమలు

రేషన్ బియ్యం ఎవరైనా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామంటూ పోలీసులు, ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు కేవలం మాటలకే పరిమితమవుతున్నాయి. ఈ దందా కొందరు దశాబ్ద కాలంగా కొనసాగిస్తూ అన్ని వ్యవస్థలను శాసించే స్థాయికి చేరుకున్నారు. మోమిన్‌పేట, వికారాబాద్, జిల్లా సరిహద్దు ప్రాంతాలైన కోస్గీ, బొంరాస్‌పేట తదితర మండలాలనుంచి సైతం రేషన్ బియ్యం పరిగి, కొడంగల్ ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. రాష్ట్ర సరిహద్దు నుంచి కర్ణాటకతో పాటు ఫౌల్ట్రీ, దాణా తయారీ కంపెనీలకు ఈ బియ్యం విక్రయిస్తున్నారు.

గుట్టుగా రైస్ మిల్లులకు..

పరిగి, కొడంగల్, తాండూరు, యాలాల, దారూరు, బొంరాస్‌పేట, దోమ, కుల్కచర్ల తదితర మండలాల్లో అధిక సంఖ్యలో రైస్‌మిల్లులు ఉండటంతో గుట్టుగా సంచులు మార్చి పాలిష్ కొట్టి సాధారణ బియ్యంలో కలిపి విక్రయిస్తున్నట్లు సమాచారం. సీఎంఆర్ కోసం ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం రైస్ మిల్లర్లు కర్ణాటక తదితర ప్రాంతాలకు, వ్యవసాయ మార్కెట్లకు తరలించి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లాలో మొత్తం 2,14,264 రేషన్ కార్డులు ఉండగా వీటికి 3815. 28 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రతి నెలా సరఫరా చేస్తున్నారు. కరోనా సమయంలో రెండింతల కోటా సరఫరా చేశారు. అయితే ప్రతినెలా సరఫరా చేసే కోటాలో సగానికిపైగా బియ్యం నల్లబజారుకు తరలుతున్నట్టు ఆరోపనలు వినిపిస్తున్నాయి.

అధికారుల కనుసన్నల్లోనే..

అధికారుల నిఘానేత్రం కొరవడింది అనేకంటే చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనేది పలు సంఘటనలు రుజువు చేస్తున్నాయి. అక్రమ దందాను అరికట్టేందుకు పోలీసులు, రెవెన్యూ విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ తదితర టీంలు ఉన్నప్పటికీ రేషన్ బియ్యం దందా యథేచ్ఛగా కొనసాగుతూనే ఉంది. ఈ దందా లాభసాటిగా ఉండటంతో కొత్త వ్యక్తులు కూడా ప్రవేశిస్తున్నారు. దందా చేసేది , పట్టుబడుతున్నది వారే అయినా.. ప్రతి సారి కొత్త వ్యక్తులు, డ్రైవర్లు, పనీవాళ్ల పేరుతో కేసులు నమోదు అవుతున్నాయి. అధికారుల సలహా మేరకే ఇదంతా జరుగుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో అక్రమార్కుల బ్లాక్ దందా మూడుపువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతోంది. పాఠశాలలనుంచి, రేషన్‌డీలర్ల నుంచి తరలించే సమయంలో పట్టుబడ్డా ఇప్పటి వరకు ఏవరిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో అక్రమార్కులు అధికారులనే శాసించే స్థాయికి చేకుంటున్నారు.

కులవృత్తులకు చేయూత

- రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం
- నియోజకవర్గానికి 50మంది చొప్పున ఎంపిక
- 11న జిల్లా స్థాయి కవి సమ్మేళనం
- కలెక్టర్ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

వికారాబాద్ అర్బన్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కులవృత్తుల వారికి ప్రభుత్వం చేయూత నిస్తోందని కలెక్టర్ సి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉత్సవాల్లో భాగంగా ఈ నెల ఈ నెల 11న జిల్లా స్థాయి కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ సాహిత్య దినోత్సవంలో భాగంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సాయంత్రం 5గంటలకు జిల్లా స్థాయి కవి సమ్మేళనం జరుగుతుందన్నారు. ఆసక్తిగల కవులు, రచయితలు తెలంగాణ అస్తిత్వం, సాధించిన ప్రగతి ప్రతిబింబించేలా కవితలు ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. కవి సమ్మేళనం తెలుగు, ఉర్దూ భాషల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పాల్గొనదల్చిన కవులు, రచయితలు తమ కవితలను స్వీయ కవితగా ధ్రువీకరిస్తూ ఈ నెల 9న సాయంత్రం 5 గంటల లోగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

సంక్షేమ సంబరాలలో భాగంగా..

తెలంగాణ సంక్షేమ సంబరాలలో భాగంగా వెనుకబడిన వర్గాలకు చెందిన కుల వృత్తుల వారికి లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 20 వరకు దరఖాస్తులను స్వీకరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ 18 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాల లోపు వయసు గల 15 రకాల వృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తారన్నారు. కల్యాణలక్ష్మి మినహాయించి, ఇప్పటి వరకు రూ.50 వేలకు మించి ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన వారు ఈ పథకానికి అర్హులు కారని తెలిపారు. స్థానిక శాసన సభ్యుల సహకారంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని వృత్తుల వారికి ఈ పథకం కింద ఎంపిక చేయాలని, ప్రతి నియోజకవర్గం నుంచి 50 మంది వరకు లబ్ధిదారులను ఎంపిక చేసి ఆ జాబితాను గురువారం అందజేయాలన్నారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా ఆధార్ కార్డు, కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు.

సాగులో సంచలనం

- కేసీఆర్ విజన్‌తోనే సాధ్యమైంది
- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: ముఖ్యమంత్రి కేసీఆర్ విజన్ వల్లే రాష్ట్రం దేశంలో నంబర్ వన్‌గా నిలిచిందని ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి అన్నారు. బుధవారం చేవెళ్లలో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో సాగునీటి దినోత్సవం నిర్వహించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాధించిన ప్రగతి, చేపట్టిన కార్యక్రమాలపై వీడియోను ప్రదర్శించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. సాగునీటి రంగంలో సంచలనం సృష్టించామని తెలిపారు. ప్రాజెక్టుల రీ డిజైన్‌తో సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 19లక్షల ఎకరాల సాగు పెంచారని గుర్తు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

'పాలమూరు'తో సస్యశ్యామలమే

- సాగునీటి రంగంలో విప్లవాత్మక మార్పులు
- ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్
- ఘనంగా సాగునీటి దినోత్సవం

వికారాబాద్ అర్బన్: పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా జిల్లాకు తాగు నీరు, సాగునీరు అందుతుందని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తెలిపారు. బుధవారం రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో సాగునీటి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనంద్ మాట్లాడుతూ పాలమూరు ఎత్తిపోతలను పూర్తి చేసి తీరుతామన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత సాగునీటి రంగంలో సమూల మార్పులు తీసుకువచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అతిపెద్ద కాళేశ్వరం ప్రాజెక్టును కేవలం మూడు ఏళ్లలో కేసీఆర్ పూర్తి చేశారన్నారు. మిషన్ కాకతీయతో చెరువుల పూడిక తీయడంతో భూగర్భ జలాలు మరింత వృద్ధి చెందాయన్నారు. ఆయకట్టు సాగు సైతం పెరిగిందన్నారు. అనంతరం ధారూరు మండలానికి చెందిన రైతులు అనంతయ్య, రవి, మర్పల్లి మండలానికి చెందిన రైతులు రాజిరెడ్డిలు సాగునీటిపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిపై ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రామిరెడ్డి, వికారాబాద్ ఆర్డీఓ విజయకుమారి, జిల్లా ఇరిగేషన్ అధికారి హెప్సీనాథ్, డీఈలు రవి కుమార్, భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వానలు కురవాలి.. సిరులు పండాలి

వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని కోరుతూ పూడూర్ ప్రజలు గ్రామ దేవతలను వేడుకున్నారు. బుధవారం బోనాలతో తరలివెళ్లి అమ్మవార్లకు మొక్కులు తీర్చుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. - పూడూర్

పొంచిఉన్న నకిలీ

- గుట్టుగా పత్తి విత్తనాల అక్రమ వ్యాపారం
- రహస్య ప్రాంతాల్లో భారీగా నిల్వలు
- సాగుకు సన్నద్ధమవుతున్న రైతులకు తప్పని బెడద
- ప్రభుత్వమే రాయితీపై అందించాలని డిమాండ్
- జిల్లాలో 1.73 లక్షల హెక్టార్లలో సాగు భూములు



జీవన్గీలో పొలం చదును చేస్తున్న రైతు



పత్తి విత్తనాలు నాటుతున్న మహిళలు

బషీరాబాద్: నకిలీ విత్తనాల బెడద నుంచి రైతులు తప్పించుకోలేకపోతున్నారు. ఎదో రూపంలో అక్రమార్కులు నకిలీ విత్తనాలను అంటగడుతున్నారు. నాణ్యమైన బ్రాండెడ్ కంపెనీ పేర్లతో రైతులను నిలువునా దోచుకుంటున్నారు. విత్తాక పిలకలు మొలువకపోవడంతో మోసపోయామని మేల్కొంటున్నారు. వానాకాలం సాగుకు రైతులు సన్నద్ధమవుతున్న వేళ అక్రమార్కులు ముందుగానే నకిలీ విత్తనాలను విక్రయించడానికి రహస్య ప్రాంతాల్లో భారీగా నిల్వలు చేసుకుంటున్నట్లు సమాచారం. జిల్లాలోని అన్నీ మండలాల్లో వ్యవసాయమే ప్రధాన వనరు. సుమారు 8 లక్షల మంది రైతులు ఈ వానాకాలం సీజన్‌లో 1.73 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూముల్లో పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నారు. అయితే ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు అరకొర సరఫరా చేయడం, అందులోనూ ప్రధాన వాణిజ్య పంట పత్తి విత్తనాలను సరఫరా చేయకపోవడంతో రైతులు వ్యాపారుల దగ్గరకు పరుగులు పెడుతున్నారు. మెజార్టీ రైతులు శావుకారుల దగ్గర పంటల మీద డబ్బులు చెల్లిస్తామని విత్తనాలను, ఎరువులను ఉద్దెర రూపంలో కొంటుంటారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కొంత మంది వ్యాపారులు నకిలీ విత్తనాలను అంటగడుతున్నారు. మంచి బ్రాండెడ్ విత్తన కంపెనీ పేర్లతో ఉన్న విత్తనాలను విక్రయిస్తున్నారు. అవే విత్తనాలను విత్తిన పొలాల్లో పంట ఎదుగుదల లేకపోవడం, మరికొన్ని పొలాలలో మొక్కలు ఎదిగినా కాత కాయకపోవడం, తెగుళ్ల సోకడం వంటి సమస్యలను రైతులు ప్రతీ సారీ ఎదుర్కొంటున్నారు.అయితే వీటినిని వారించడానికి రాష్ట్ర ప్రభుత్వం విత్తన,ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ,పోలీసు శాఖల ఆధ్వర్యంలో ఇప్పటికే సోదాలు చేయించింది కూడా. కానీ నకిలీ విత్తనాల అక్రమార్కులను మాత్రం అరికట్టడంలేదు.

మంతట్టి ఘటనే సాక్ష్యం

గతేడాది బషీరాబాద్ మండలంలోని ఒక్క మంతట్టి గ్రామంలోనే సుమారు వెయ్యి ఎకరాల్లో సాగు చేసిన పత్తి పంట విత్తనం నకిలీవని పంట తీసే సమయానికి రైతులు గుర్తించారు. ఓ ప్రముఖ విత్తన కంపెనీకి చెందిన విత్తనాలను వేసిన రైతులకు దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయారు. ఎకరాకు 10 నుంచి 15క్వింటాళ్ల దిగుబడి రావాల్సిన పత్తి కేవలం 4 నుంచి 5 క్వింటాళ్లు మాత్రమే వచ్చిందని రైతులు చెబుతున్నారు. విత్తనాల్లోనే లోపముందని రైతులు అధికారులకు, కంపెనీకి ఫిర్యాదు చేయడంతో ఆ రకం పత్తి విత్తనాలను ప్రభుత్వం నిషేధించినట్లు రైతులు పేర్కొంటున్నారు. వాణిజ్య పంటల విత్తనాలను ప్రభుత్వమే రాయితీపై అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

"నకిలీవి గుర్తించలేకపోతున్నాం



మార్కెట్‌లో అనేక కంపెనీల విత్తనాలు వస్తున్నాయి. గతంలో 20ఎకరాల్లో పంట సాగు చేశా. పంట ఏపుగా పెరిగినా కాత మాత్రం కాయలేదు.ఒక్కో పత్తి చెట్టుకు 50 కంటే తక్కువ కాయలు మాత్రమే కాశాయి. వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకొని మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకపోయింది. విత్తనం విత్తాక గానీ అవి నకిలీవని గుర్తించలేక పోయాం. ఈసారి అలాంటి నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా చూడాలి.

- తలారి సురేశ్, రైతు మంతట్టి

అప్రమత్తంగా ఉండాలి

వాణిజ్య పంటలు సాగు చేసే రైతులు విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలి. విత్తన లైసెన్సు ఉన్న దుకాణంలోనే కొనుగోలు చేయాలి. విత్తనాల ప్యాకెట్‌పైన మొలక శాతం 75 శాతం కంటే ఎక్కువ ఉన్న వాటినే కొనాలి. విత్తనం విత్తేకంటే ముందు కొన్ని శాంపిల్స్ పొలంలో నాటి చూడాలి. విత్తనాలు కొన్న రశీదు, విత్తన ప్యాకెట్ కవరును పంట దిగుబడి వచ్చే వరకు జాగ్రత్తగా దాచుకోవాలి. మరోవైపు నకిలీ విత్తనాల నివారణ కోసం ప్రత్యేక బృందాలు ముమ్మరంగా తనిఖీలు చేశాయి. అక్కడక్కడా నకిలీవని తేలడంతో వారిపై కేసులు నమోదు చేశాం.

- గోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

'బీసీ బంధు' ప్రకటించాలి

బంట్వారం: బీసీ బంధు పథకాన్ని ప్రకటించి ప్రతి కుటుంబానికి రూ.10 లక్షలు మంజూరు చేయాలని ఆ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ లక్ష్మణ్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ వెంటనే స్పందించి బీసీ బంధు పథకాన్ని ప్రకటించాలని కోరారు. లేకుంటే జనాభాలో 56శాతం ఉన్న బీసీలు రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడిస్తారని ఆయన పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కుల్కచర్ల: పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేకాధికారి దేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీలోపు సెల్ నంబర్ 9550335857 లేదా పాఠశాలలో సంప్రదించాలని సూచించారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులు, డ్రాపౌట్ విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

రైతుల ఇబ్బందులు తీర్చాలి: సాయిలు

కొడంగల్ రూరల్: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగించాలని దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగం సాయిలు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పెద్దనందిగామ, పట్టణంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ధాన్యం విక్రయించేందుకు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ధాన్యం విక్రయించేందుకు రైతులు పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు త్వరితగతిన ధాన్యం కాంటా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

కాలు జారిపడి పంచాయతీ కార్మికుడి మృతి

నవాబుపేట: ప్రమాదవశాత్తు కాలుజారి పడి పంచాయతీ కార్మికుడు మృతి చెందిన సంఘటన గొల్లగూడ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటయ్య(38) పంచాయతీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఒంటరి కావడంతో తల్లి కిష్టమ్మతో కలిసి ఉంటున్నాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటి వద్ద ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి మృతి చెందాడు. అంత్యక్రియలకు సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ ఆర్థిక సాయం చేశారు.

మేకల మందపై కుక్కల దాడి

20 జీవాలు మృత్యువాత



కందుకూరు: వీధి కుక్కల దాడిలో 20 మేకలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని గఫూర్‌నగర్‌లో ఈర్లపల్లి ప్రభాకర్‌కు చెందిన మేకల మందపై మంగళవారం రాత్రి వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో మేకలు మృత్యువాత పడడంతో బాధితుడు ప్రభుత్వమే ఆదుకోవాలంటూ బోరున విలపించాడు. కాగా బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఘటనా స్థలిని పరిశీలించి బాధితుడికి న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు.

కార్మికుడి ఆత్మహత్య

తాండూరు టౌన్: కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం తాండూరు పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అసోం రాష్ట్రం బర్పేట్ జిల్లాకు చెందిన గఫూర్ అలీ కుమారుడు అస్లాం అలీ(25) కొంతకాలంగా మరికొందరితో కలిసి స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయం సమీపంలోని ఓ ఇంట్లో కిరాయికి ఉంటున్నారు. వీరంతా సీసీ రోడ్డు నిర్మాణ పనుల నిమిత్తం అసోం నుంచి వచ్చారు. బుధవారం అందరూ పనులకు వెళ్లిన అనంతరం అస్లాం అలీ ఇంట్లో ఉరేసుకుని మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

పాత పంటలు ఏమాయె !

- ఆ తరహా పంటలు పండించే వారేరీ?
- వాణిజ్య పంటలపై మోజు ఎక్కువ
- మారుతున్న ప్రజల ఆహార అలవాట్లు
- సజ్జ, ఉలవ, రాగులు, సామలు, కొర్ర సాగు జోలికెళ్లని జనం
- వీటిలో పోషకాలు పుష్కలం
- ప్రోత్సహిస్తే ఆరోగ్యం పదిలం



సజ్జ పంట



కొర్ర పంట

బొంరాస్‌పేట: పాత పంటలు పరమౌషధాలు. సజ్జ, ఉలవ రొట్టెలు, లైద అంబలి.. సామలు, కొర్రలు వానసొడ్ల అన్నం.. ఇలా చెప్పుకుంటూ పోతే పోషక విలువలు పుష్కలంగా ఉండే ఎనకటి పంటలు అనేకం.. ఆనాటి ఆహారపు అలవాట్ల గురించి మన పెద్దలు లొట్టలేసుకుంటూ చెబుతుంటే వినడానికి రెండు చెవులు చాలవు. అలాంటి ఆహారంతో శారీర దారుఢ్యం, పుష్టి, ఆరోగ్యంతో నిండునూరేళ్ల జీవితాన్ని సంపూర్ణం చేసుకున్నారు. మారుతున్న కాలంతోపాటు మనిషి అలవాట్లు అన్ని మారిపోతున్నాయి. ఆరోగ్యానికి బదులు అందంగా ఉండే ఆహార పదార్థాలను ఇష్టపడుతున్నారు. పాతకాలపు ఆహారపు అలవాట్లను చూసి ఎద్దేవా చేసే వారున్నారు. చీదరించుకునే వారు కూడా లేకపోలేరు. వారి చూసి ఎలా భావించాలో తెలియదుకాని ఆనాటి పెద్దలకు మాత్రం వారిపట్ల జాలేస్తుందంటున్నారు.

ప్రపంచ ఆహార భద్రత దినం తెలుసా?

ప్రతియేటా జూన్ 7న ప్రపంచ ఆహార భద్రత దినం అనే విషయం చాలా మందికి తెలియదనే చెప్పాలి. వ్యవసాయంలో ఇప్పటికీ సాంప్రదాయ పద్ధతులు ఉన్నాయి. కానీ ఆహారపు అలవాట్లు పూర్తిగా మారిపోయాయి. బలమైన ఆహారాన్ని వదులుకొని రోజు రోజుకూ రోగాల తెచ్చే మందుల కూడాను శరీరానికిస్తున్నారు. దీని వల్ల మనిషి సగటు జీవన ప్రమాణపు ఆయుస్సు తరిగిపోతుంది. ఆనాటి ఆహారపు అలవాట్లను విడనాడలేక పాతకాలం నాటి పంటలను అక్కడక్కడ సాగు చేస్తూనే ఉన్నారు. సజ్జలు, సామలు, కొర్రలు, తైదలు(రాగులు), ఉలువలు, నల్లవడ్లు మొదలగు ఆహార ధాన్యాలను నూటికో.. కోటికో అన్నట్లు పొలాల్లో కనిపిస్తున్నాయి. వీటిని వ్యవసాయశాఖ వారు ఉద్యమ రూపంలో ప్రోత్సహిస్తే తప్పా ఆరోగ్యం అందడం కష్టసాధ్యమే. అనాటి పాత పంటల సాగు విధానం, వాటిలోని పోషక విలువలు ఇలా ఉన్నాయి. సాముల వ్యవసాయ పంట కూడా లేకపోవడం విచారకరం.

ఏడాదిలోగా సాగునీరు

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హామీ
- వ్యవసాయాన్ని పండుగలా మార్చిన కేసీఆర్
- ఇబ్రహీంపట్నంలో ఘనంగా సాగునీటి దినోత్సవం

ఇబ్రహీంపట్నం: వ్యవసాయాన్ని పండుగగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఏడాదిలోగా నియోజకవర్గానికి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఇబ్రహీంపట్నంలో సాగునీటి దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. కేసీఆర్ రైతురాజ్యంలో పుట్ల కొద్ది పంట దిగుబడి అవుతోందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో ధ్వంసమైన చెరువులను మిషన్ కాకతీయ కింద బాగు చేశామని, దీంతో ఎక్కడ చూసినా జలకళ సంతరించుకుందని, భూగర్భ జలాలు బాగా పెరిగాయని వివరించారు. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువుకు ప్రధాన ఆధారమైన పెద్దవాగును రూ.15.34 కోట్లతో ఆధునీకరించామని తెలిపారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద 5వ జలాశమైన ఉద్దండపూర్ రిజర్వాయర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, అక్కడి నుంచి 105 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న ఎడమ కాలువ ద్వారా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని 54 వేల ఎకరాలకు సాగు నీరు వస్తుందని తెలిపారు. శివన్నగూడ ఎత్తిపోతల ద్వారా నియోజకవర్గ తూర్పు ప్రాంతానికి మరో 30 వేల ఎకరాలకు సాగునీరు అందనున్నట్లు చెప్పారు. 120 చెరువులు నింపి 84 ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనులు జరుగుతున్నట్లు చెప్పారు. సాగునీటి రంగంలో ప్రగతి ప్రవాహం అనే అంశంపై ప్రభుత్వం ముద్రించిన పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, నోడల్ అధికారిని సునీత, ఎంపీపీ కృపేశ్, ఇరిగేషన్ డీఈ ఉషారాణి, జెడ్పీటీసీ జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

బావమరికి వీడ్కోలు చెప్పేందుకు వెళ్తూ..

నవ వరుడు దుర్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్: సోదరి వివాహం కోసం విదేశాల నుంచి వచ్చిన తన బావమరిదికి వీడ్కోలు పలికేందుకు వెళ్తుండగా జరిగిన కారు ప్రమాదంలో నవ వరుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ లక్ష్మీనారయణ తెలిపిన ప్రకారం.. బోడుప్పల్లోని కేశవనగర్ కాలనీ ఎస్వీ బృందావన్‌లో నివాసం ఉండే ప్రైవేట్ లెక్చరర్లు మురళీధర్, సుచరిత దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు హర్షిద్(26) సాఫ్ట్‌వేర్‌గా పని చేస్తున్నాడు. మే 10న జరిగిన హర్షిద్ వివాహానికి విదేశాల నుంచి బావమరిది వచ్చాడు. తిరుగు ప్రయాణం నేపథ్యంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్తుండగా రాత్రి రావిర్యాల వద్ద ముందు వెళ్తున్న కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వాహనాన్ని తప్పించే క్రమంలో రోడ్డు ప్రక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హర్షిద్(26) మృతి చెందాడు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

మాదక ద్రవ్యాల నిర్మూలనకు చర్యలు

కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: జిల్లాలో గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనకు సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ కోటిరెడ్డితో కలిసి నార్కోటిక్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కళాశాల, పాఠశాల విద్యార్థులు గంజాయికి అలవాటు పడి తమ అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా హైదరాబాద్‌కు దగ్గరగా ఉన్నందున ఫామ్‌హౌస్ కల్చర్ వస్తోందని, ఈ కారణంగా డ్రగ్స్ కల్చర్ పెరిగే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని కొన్ని మండలాల్లో రైతులు గంజాయి పండిస్తున్నట్లు సమాచారం ఉందని, వ్యవసాయ శాఖ అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. గంజాయి పండించే రైతులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం అందించే రైతుబంధు, రైతు బీమా పూర్తిగా నిలిపివేయడం జరుగుతుందని హెచ్చరించారు. కళాశాలల్లో, పాఠశాలల్లో తరుచూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాలు ఉపయోగించడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో ఆగస్టులో ప్రారంభమయ్యే మెడికల్ కళాశాలలో డి-ఎడిక్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో మాదక ద్రవ్యాల ప్రభావం ఎక్కువగా ఉందని, దీని నిర్మూలనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటి వరకు 52మంది నేరస్తులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. వారి నుంచి గంజాయి విత్తనాలు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 29 కేసుల్లో 26 చార్జిషీట్లు దాఖలు చేసినట్లు తెలిపారు. మరో 3 కేసులు విచారణలో ఉన్నట్లు వివరించారు. జిల్లాలో గంజాయి నిర్మూలనకు ఎక్సైజ్, అటవీ, వ్యవసాయ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర ప్రాంతాల నుంచి అనంతగిరి పర్యటనకు వచ్చే వారిని నిశితంగా గమనిస్తూ ఉండాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, నారాయణ అమిత్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ చంద్ర, అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ పాల్వాన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పైలెట్ గృహ ప్రవేశానికి మంత్రి సబిత

తాండూరు టౌన్: ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి నూతన గృహ ప్రవేశ కార్యక్రమం బుధవారం జరిగింది. మంత్రి సబితారెడ్డి హాజరై ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు. ఆయన జన్మదిన వేడుకల్లో సైతం పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు మంత్రి కేక్ తినిపించారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, హైదరాబాద్ నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న మంత్రి సబితారెడ్డి

సీఎం చొరవతోనే సాగు నీరు

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: సీఎం కేసీఆర్ ముందు చూపుతోనే చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయని, పంటలు బాగా పండి రైతులు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాగునీటి విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో నీళ్ల విషయంలో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఇప్పుడు ప్రాజెక్టులకు జలకళ సంతరించుకున్నాయని పేర్కొన్నారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ, పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఇలా ఎన్నో పథకాలను తెచ్చి తెలంగాణను పచ్చగా చేశారన్నారు. రైతులకు సాగు నీరు అందించాలనే సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలకు రూపకల్పన చేశారని తెలిపారు. అలాగే ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం పని చేస్తోందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతి వర్గాన్ని దృష్టిలో ఉంచుకుని పథకాలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రుణమాఫీ

- మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

మర్పల్లి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏక కాలంలో రూ 2 లక్షల రుణమాఫీ చేస్తామని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ రైతులకు హామీ ఇచ్చారు. బుధవారం మండలంలోని రావులపల్లిలో హాత్ సే హాత్ జోడో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సోనియా గాంధీ చొరవతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. కానీ బీఆర్ఎస్ పాలనలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని ఆరోపించారు. కేవలం సీఎం కేసీఆర్ కుటుంబానికి మాత్రమే లబ్ధి చేకూరిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రతి ఏటా పంట పెట్టుబడి కింద ఎకరాకు రూ. 15 వేలు చొప్పున రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామన్నారు. రైతుల పాలిట గుదిబండగా మారిన ధరణి పోర్టల్‌ను రద్దు చేసి కొత్తగా రెవెన్యూ చట్టాన్ని తెస్తామన్నారు. వంద హామీలు ఇచ్చిన సీఎం కేసీఆర్ కేవలం 5 హామీలనే అమలు చేశారని పేర్కొన్నారు. దళితులకు 3 ఎకరాల భూమి, లక్ష లోపు రుణమాఫీ, కేజీ టూ పీజీ ఉచిత విద్య నేటికీ అమలు కాలేదన్నారు. కార్యక్రమంలో బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ సాగర్, జిల్లా సీనియర్ నాయకులు శంకరయ్యగౌడ్, రఘుపతిరెడ్డి, మండల వర్కింగ్ ప్రసిడెంట్లు సంజీవరెడ్డి, లక్ష్మారెడ్డి, రాచన్న, సురేష్, సలీం, ప్రభాకర్, మర్పల్లి మండల పరిషత్ మాజీ ఎంపీపీ నర్సింలు, జిల్లా నాయకులు సంజీవరెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మర్పల్లి సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

భక్తి మార్గంతో మానసిక ప్రశాంతత



మోమిన్‌పేట: ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

మోమిన్‌పేట: మానసిక ప్రశాంతతకు ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని ఎంచుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బాల్‌రెడ్డిగూడెంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి, గణపతి, శివపార్వతులు, నవగ్రహాలు, బొడ్రాయి, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని సూచించారు. దైవ దర్శనంతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు చంద్రకళ, నర్సింహారెడ్డి, ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్ గౌడు, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు డి.వెంకట్, వైస్ ఎంపీపీ మానస తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావం ఉండాలి

అనంతగిరి: ప్రతి ఒక్కరికీ భక్తిభావం ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. బుధవారం వికారాబాద్‌లోని రామయ్యగూడ హనుమాన్ మందిరంలో ధ్వజ స్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ ఏ చంద్రశేఖర్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల దంపతులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

మంచాల: అతి వేగం ఓ యువకుడి ప్రాణం తీయగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని సత్యం తండాకు చెందిన రమావత్ సచిన్(19) పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. విధులు ముగిసిన తర్వాత అదే బంక్‌లో పని చేస్తున్న ఎల్లపల్లి తండా, సాయిబండ తండాకు చెందిన మరో ఇద్దరు యువకులతో కలిసి సత్యం తండాకు వెళ్తున్నారు. అతివేగంతో వెళ్తున్న బైక్ లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో సచిన్ అక్కడికక్కడే మృతి మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

'పాలమూరు'తో సస్యశ్యామలం

తాండూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుతో తాండూరు ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని భవానీ ఫంక్షన్ హాల్లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాగునీటి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాతనే సాగునీటి ప్రాజెక్టుల వలన పెద్ద ఎత్తున తడి పంటలు సాగు చేస్తున్నామని తెలిపారు. నియోజక వర్గంలో 185 చెరువులకు మిషన్ భగీరథ కింద చెరువులను మరమ్మతులు చేశామన్నారు. తాండూరు ప్రాంతంలో పెద్ద ఎత్తున చెక్‌డ్యాంలు నిర్మించి భూగర్భ జలాలు పెంపొందిస్తున్నామని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజుగౌడ్

కబ్జాలను అరికట్టండి

తాండూరు పరిధిలోని చిలుకవాగు కబ్జా అవుతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న అన్నారు. సాగు నీటి దినోత్సవంలో పాల్గొని ఆమె మాట్లాడారు. చిలుకవాగును కబ్జా నుంచి కాపాడాలని ఆమె ఇరిగేషన్ అధికారులను కోరారు. ఆర్డీఓ అశోక్‌కుమార్, ఇరిగేషన్ ఈఈ సుందర్‌రాజ్, డీఈలు కృష్ణయ్య, శిరీష, సెరికల్చర్ ఏడీ మల్లికార్జున్ పాల్గొన్నారు.

డీజిల్ వాహనం సీజ్

కొడంగల్ రూరల్: కర్ణాటక నుంచి డీజిల్‌ను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని బుధవారం పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ రవిగౌడ్ తెలిపిన వివరాలు.. మండలంలోని రావులపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. కర్ణాటక రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు వాహనంలో డీజిల్‌ను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డిప్యూటీ తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చి, వారి ఫిర్యాదు మేరకు శివశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న డీజిల్ వాహనం

ప్రాణం తీస్తున్న పార్టీలు


మొయినాబాద్: స్నేహితులతో కలిసి సరదాగా గడపాలని.. విందులు చేసుకుని ఉత్సాహంతో ఉండాలని ప్రతీ ఒక్కరు కోరుకుంటారు. యువత అనుకున్నదే తడువు ఏర్పాట్లు చేసేస్తుంటారు. అలాంటి విందులు, వినోదాలకు ఫాంహౌస్‌లను ఎంపిక చేసుకుని బయలుదేరుతున్నారు. స్నేహితులతో కలిసి ఆనందంతో గడిపినవారు అంతలోనే ప్రమాదాల బారిన పడి కుటుంబాల్లో విషాదాన్ని నింపుతున్నారు. ఇటీవల మొయినాబాద్‌లో ఇలాంటి ఘటనలు వరుసగా చోటుచేసుకుంటున్నాయి.

ఓఆర్ఆర్‌కు చేరువలో..

హైదరాబాద్‌కు మొయినాబాద్ అతిచేరువలో ఉంది. మండలంలో ఔటర్ రింగ్‌రోడ్డు పక్కనే ఫాంహౌస్‌లు అనేకం ఉన్నాయి. నగరం నుంచి సెలవు రోజులు, వారాంతాల్లో ఇక్కడి ఫాంహౌస్‌లకు వచ్చి సరదాగా గడుపుతుంటారు. ప్రస్తుతం వేసవి సెలవులు ఉండటంతో నిత్యం వందలాది మంది ఫాంహౌస్‌లకు వచ్చి ఎంజాయ్ చేస్తున్నారు. అయితే ఫాంహౌస్‌లకు వెళ్లేటప్పుడు.. ఫాంహౌస్‌లో ఎంజాయ్ చేసి తిరిగి నగరానికి వెళ్లేటప్పుడు కొంత మంది ప్రమాదాల బారినపడి ప్రాణాలో కోల్పోయి వారి కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతున్నారు.

వరుస ప్రమాదాలు

ఫాంహౌస్‌లు విందులు, వినోదాలతో సరదాగా గడిపేందుకు వచ్చినవారు ఇటీవల వరుసగా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. పదిహేను రోజుల వ్యవధిలోనే రెండు ప్రమాదాలు జరిగి ఇద్దరు మృతి చెందారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు ఎన్నో చోటుచేసుకున్నాయి. ఏడాది క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన యువతీ, యువకుడు నగరంలో కారు అద్దెకు తీసుకుని వికారాబాద్ జిల్లా అనంతగిరికి వెళ్లారు. అక్కడ హరిత రిసార్ట్స్‌లో రోజంతా సరదాగా గడిపి రాత్రి నగరానికి వెళ్తుండగా మండల పరిధిలోని అజీజ్‌నగర్ పాత చౌరస్తా వద్ద కారు అతివేగంతో వెళ్లి డివైడర్‌ను ఢీకొని ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వారు ఘటనాస్థలిలోనే మృతి చెందారు. రెండేళ్ల క్రితం నగరానికి చెందిన ఏడుగురు యువతీ, యువకులు కారులో వికారాబాద్‌లో ఫాంహౌస్‌కు వెళ్తుండగా కనకమామిడి గేటు సమీపంలో ఎదురుగా వచ్చిన కారును ఢీకొట్టడంతో ఇద్దరు యువతులు మృతి చెందారు. మే 22న నగరంలోని యూసుఫ్‌గూడకు చెందిన ఇద్దరు యువకులు ఓ ఫాంహౌస్‌కు వచ్చారు. రాత్రంతా సరదాగా గడిపారు. 23న బైక్‌పై నగరానికి వెళ్తూ మండలంలోని ఓ కంపెనీ మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో ఓ యువకుడు మృతి చెందాడు. తాజాగా సోమవారం రాత్రి మొయినాబాద్ మండలం కనకమామిడి శివారుల్లో ఉన్న ఓ ఫాంహౌస్‌కు నగరంలోని కార్వాన్, మిర్ఆలమ్ మండి ప్రాంతానికి చెందిన ఐదుగురు యువకులు కారులో వచ్చి తిరుగు ప్రయాణంలో తాజ్‌హోటల్ వద్ద రాంగ్ రూట్లో అతివేగంతో వెళ్లి ఎదురుగా వచ్చిన లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు.



తాజ్ హోటల్ వద్ద లారీని ఢీకొట్టి కారు